క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసీదళాలు, పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలకు బీఎల్ఓల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, సిబ్బందితో ఓటరు నమోదు, సవరణ, తొలగింపు దరఖాస్తుల పరిశీలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులతో పాటు చిరునామా మార్పు, డబుల్ ఎంట్రీల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ పి. చిట్టెమ్మ, ఆర్ఐ ఎస్. శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు రామారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ

బలిజిపేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని వంతరాం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సమయంలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మావుడి సోదరులు

మక్కువ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.దేవకుమార్, ఎంఈఓలు సత్యనారాయణ, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ దాతృత్వం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. జగన్నాథపురం కాలనీ ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న కొమ్ము సాత్విక్ నవోదయ ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు సాధించాడు. మరికొద్ది రోజుల్లో తాటిపూడి నవోదయలో చేరాల్సి ఉంది. అయితే సాత్విక్ తండ్రి దివ్యాంగుడు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న హెచ్‌సీ కృష్ణమూర్తి గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థికి రూ.2 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు.

ప్రజలు సహకరించండి

సాలూరు: మున్సిపాలిటీ అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేపడుతున్న నేపథ్యంలో పారిశుధ్యం విషయంలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జయరామ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ప్రజలు కాలువలు, రోడ్ల మీద చెత్త వేయరాదన్నారు. దగ్గరలో ఉన్న డస్ట్‌బిన్‌లలో చెత్త వేయాలని సూచించారు.

క్రీడలతో గుర్తింపు..

- జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు



సీతానగరం: క్రికెట్‌లో విజేతగా నిలిచిన గుచ్చిమి క్రీడాకారులు



మక్కువ: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న మావుడి సోదరులు

మక్కువ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులను గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మావుడి సోదరులు మాట్లాడుతూ, క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు పెంట సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, హెచ్‌ఎం హేమలత, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మూడో రోజు అన్ని సచివాలయాల్లో జరుగుతున్నాయి. మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోటీలలో గుచ్చిమి యువకులు వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు. క్రికెట్ పోటీలో గుచ్చిమి వారియర్ టీమ్ విజయం సాధించడంతో యువకులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ జగదీశ్వరరావు, శ్రీలక్ష్మి, తదితరులున్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: ఆరోగ్యంపై అవగాహన ద్వారా పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యానికి రోగ నిరోధక శక్తి ప్రామాణికమన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ ప్రతిరోజూ తగినంత శారీరక శ్రమ ఉన్నవారికి రోగ నిరోధక వ్యవస్థ బాగుంటుందన్నారు. శీతాకాలంలో శ్వాస సంబంధితమైన వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని, దీనివల్ల చర్మ వ్యాధులు రావని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.పుష్ప, జయగౌడ్, కళాశాలల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకార్డులతో మెరుగైన వైద్యం

- ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. పెదభోగిలి-1, గుచ్చిమి సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఆరోగ్యశ్రీకార్డులు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియను ఎంపీడీఓ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులున్న వారందరికీ ప్రభుత్వం గుర్తించిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యం అందుతుందని చెప్పారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ, వైద్యసిబ్బంది కార్డులు పంపిణీ చేస్తున్నారన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



శివరాంపురంలో కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సాలూరు: మండలానికి నూతనంగా వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. మండలంలోని శివరాంపురంలో సర్పంచ్ జర్జాపు మోహన్, ఎంపీడీఓ పార్వతి, తదితరుల చేతుల మీదుగా గురువారం లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వినియోగించుకోవాలి

సీతంపేట: పీవీటీజీ సర్వేను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి, సర్వే కూడా చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు గృహాలు మంజూరు కాని వారు, పూరిళ్లల్లో నివశిస్తున్న వారి వివరాలు సేకరించడం జరుగుతోందన్నారు. దీనివల్ల పేదలకు లబ్ధి జరుగుతుందన్నారు.

కొత్త పింఛన్ దరఖాస్తుల పరిశీలన

బాడంగి: మండల వ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు, అర్హతలను అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 113 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారు నిజంగా అర్హులేనన్న విషయాన్ని ఆధారాల ఆధారంగా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని జయితి, కె.ఎల్.వలస, ఇప్పలవలస గ్రామాల్లో కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను ఎంపీడీవో త్రివిక్రమ్ గురువారం పరిశీలించారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని, కొత్త వారికి జనవరి 1వ తేదీ నుంచి పింఛన్లు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



టీడీపీ నాయకులకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని గోపాలపురానికి చెందిన మాజీ సర్పంచ్ పెంట రమేష్ తన సహచరులతో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రానున్న రోజుల్లో పార్టీలోకి చాలా మంది వస్తారన్నారు. పెంట రమేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలన చూసి పార్టీలో చేరినట్లు చెప్పారు.

'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి



గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్



జియ్యమ్మవలస: పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎంఈవో నాగభూషణరావు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ పాఠశాల(బాలురు)లో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ విద్యార్థి చదువులో బాగా రాణించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చూడాలన్నారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈవో-1 నాగభూషణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, పలు సలహాలు, సూచనలు చేశారు. జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాష్‌ల ద్వారా ఎవరికి బోధిస్తారు.. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఎలా పెంచవచ్చన్న అంశాలను వివరించారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి, ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు ఎంఈవో ఎస్.నాగభూషణరావు సూచించారు. గురువారం మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమై, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. మార్చి నెలలో పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతీ పదో తరగతి విద్యార్థి కష్టపడి బాగా చదవాలన్నారు. సంక్లిష్టమైన సబ్జెక్టులపై తొలుత దృష్టిసారించాలన్నారు. ఏయే అంశాల్లో విద్యార్థులు వెనకబడి ఉన్నారో వారిని గుర్తించి, ఆయా అంశాలపై పట్టుసాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలపై ఆసక్తి..

వీరఘట్టం: తరగతి గదిలో బోధించే పాఠాలతో పాటు ప్రయోగ పరీక్షలపై కూడా విద్యార్థులకు ఆసక్తి పెంచాలని ఎంఈవో డి.గౌరినాయుడు సూచించారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన పలు సూచనలు చేశారు. కృత్యాధార బోధన చేపట్టాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు చేపట్టాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.పి.నాగమణి, డీఆర్‌పీ ఎ.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ..

పాలకొండ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె.సోంబాబు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మీసాల సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వీరఘట్టం మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ గురువారం ఇచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలని, కెరీర్ గైడెన్స్, ఇన్నోవేటివ్ క్లాస్‌రూమ్ రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి..

సీతంపేట: సకాలంలో సిలబస్ పూర్తి చేసి, పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని పీఎంఆర్‌సీ ఏఎంవో పి.కోటిబాబు తెలిపారు. స్థానిక ఏపీ టీడబ్ల్యూఆర్ బాలురు పాఠశాల, గిరిజన బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇక్కడ నేర్చుకునే అంశాలను పక్కాగా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీఓ అకిబ్ జావేద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అకిబ్ జావేద్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను మేట్లు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అకిబ్ జావేద్ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా మేట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేట్లు ముందస్తు కొలతలు, మొబైల్ యాప్‌తో హాజరు వేయుట, మస్తర్ల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రరావు, నర్సిపురం, వెంకంపేట, బాలగుడబ, వెంకట్రాయడుపేట, గోపాలపురం, అడ్డాపుశీల, ఉపాధి హామీ సిబ్బంది జి. నాగలక్ష్మి ఎస్. కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యం తీసుకురావాలి..

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మహిళా మేట్‌లకు ఏపీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రజలు వినియోగించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఎనర్జీ సహాయకులు

సీతానగరం: సచివాలయ వ్యవస్థ ద్వారా నియమితులైన ఎనర్జీ (విద్యుత్) సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు పలువురు ఎనర్జీ సహాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సహాయకులు మాట్లాడుతూ, తామంతా ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం నుంచి తగిన ప్రతిఫలం అందడం లేదన్నారు. ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ విద్యుత్ సహాయకులు, ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ పాల్గొన్నారు.

సన్మానం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని పారాది గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు నేమాపు వెంకటేష్‌ను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, తదితర నాయకులు కలిసి, గురువారం సన్మానించారు. పార్టీ మరింత బలోపేతానికి కృషిచేయాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని వేణుగోపాలనాయుడు ఆయనను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శాంతకుమారి, జేసీఎస్ కన్వీనర్ దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొలతలపై శిక్షణ

బలిజిపేట: మేట్లు తప్పనిసరిగా కొలతలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఓ కేశవరావు తెలిపారు. గలావల్లి, నారన్నాయుడువలస, గంగాడ, వంతరాం, అంపావల్లి, నూకలవాడ, వెంగళరాయపురం పంచాయతీలకు చెందిన మేట్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనులకు ముందస్తుగా కొలతలు కొలిచి పనులు అప్పగించాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేసేవారికి తగిన వేతనం వస్తుందన్న విషయాన్ని వేతనదారులకు తెలియజేయాలన్నారు. ఫేషియల్ యాప్‌లో వేతనదారుల హాజరు వేయాలని సూచించారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలి

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమైన ఆమె ప్రభుత్వం కొత్తగా ఆరోగ్యశ్రీ పథకంలో తీసుకువచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇదివరకు ఈ పథకం కింద కొన్ని వ్యాధుల వరకే ఉచితంగా చికిత్స ఉండేదని, ఇప్పుడు కొత్తగా మరికొన్ని వ్యాధులను కూడా చేర్చి, వాటికి కూడా ప్రభుత్వం ఉచితంగా చికిత్స చేయించడం జరుగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ పథకం వ్యయ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన విషయం కూడా ప్రజలందరికీ తెలిసేలా చూడాలన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు వివరించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పాలకొండ: మండల కేంద్రంలోని పలు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ఓటర్లకు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టగా, మొబైల్ అధికారులు పి.ఈశ్వరరావు, ఎ.ధర్మారావు, జి.ప్రసాదరావు, ఎస్.రాజారావు కలిసి, సిబ్బంది, ఓటర్లకు ఈవీఎం వినియోగించి, ఏ విధంగా ఓటు వేయాలన్న దానిని వివరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లంతా తమ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

దుప్పట్ల వితరణ

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని గారమ్మ కాలనీలో మాజీ కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి పలువురు పేదలకు దుప్పట్లు వితరణ చేసి, అన్నదానం చేశారు. ఆయన తండ్రి గుమ్మిడి అప్పలసూరి 12వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాలు చేసినట్లు సింహాద్రి తెలిపారు.